
# ఎరవు సొమ్ము

"లక్ష్మీశ్రీనివాసన్"



"అరుణా! నా మాట విను వాళ్ళు మనల్నెంతో ఆప్యాయంగా ఆహ్వానించారు అటువంటప్పుడు మనం వెళ్ళకపోతే బాగుండదు' అన్నాడు శర్మ

మీరు వెళ్ళండి, నేను రాను' అంది ఖచ్చితంగా అరుణ

మనిద్దర్నీ రమ్మని చెప్పినప్పుడు నేనొక్కడినే వెళితే ఏం బాగుంటుంది? వాళ్ళు మరోలా అనుకోవచ్చు నా మాట విని తొందరగా తయారవ్వు!" అన్నాడు బ్రతిమలాడుతూ శర్మ

అబ్బబ్బ రాను రాను అని నా నోటితో ఎన్ని సార్లు చెప్పిస్తారు ఈ పసుపు తాడుతో నేను నలుగుర్లోకీ రాలేనండీ! అంది మెడలో పసుపుతాడు వైపు చూసుకుంటూ అరుణ

'అక్కడ ఎవరి హడావిడిలో వాళ్ళుంటారు నువ్వు పసుపుతాడు వేసుకొచ్చావో – పచ్చని బంగారం గొలుసు వేసుకొచ్చావో ఎవరూ చూడరు కాని బయల్దేరు!" అన్నాడు శర్మ

పెళ్ళయి ఇన్నేళ్ళయింది వున్నది పోగొట్టారే తప్ప వీసమెత్తు బంగారం కొనలేకపోయారు మీకేం తెలుసు ఆడవాళ్ళ సంగతి! ఇలాంటి పెళ్ళిళ్ళలో – పేరంటాలలో కట్టుకున్న చీరల మీదా – పెట్టుకున్న వస్తువుల మీదే వుంటాయి వాళ్ళ కళ్ళు అంది మొహం చిట్లించుకుని అరుణ

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావ్? అసహనంగా అన్నాడు శర్మ

'నేను రావడం తప్పదనుకుంటే మీ మిత్రుడు గోపాల్‌గారి దగ్గరకెళ్ళి, ఆయన భార్య వస్తువేదైనా ఇవ్వమని అడిగి తీసుకురండి' అంది అరుణ

'ఏమిటీ, వాళ్ళ నడిగి వస్తువు తెమ్మంటావా నన్ను? పెళ్ళికి వెళ్ళడమైనా మానేద్దాం గాని చస్తే నేనలాంటి పని చెయ్యను!" అన్నాడు కోపంగా శర్మ

మరీ మంచిది వూరుకోండి! అంది నిర్లిప్తంగా అరుణ

అరుణ మొండితనం చూస్తుంటే శర్మకు ఒళ్ళు మండుకొచ్చింది అయినా అరుణ నేమనలేకపోయాడు తమ పరిస్థితి తెలిసీ అరుణ ఎందుకింత పట్టుబడుతుందో అతడికి అర్థం కాలేదు గోపాల్ కుటుంబంతో తమకు పరిచయం వున్నా వస్తువు ఎరువు కావాలని ఎలా అడగటం? తీరా వాళ్ళు కాదంటే ఎంత బాధ! ఇంత హైరానపడ్డం కంటే పెళ్ళికి వెళ్ళడం మానుకుంటే మంచిదన్న నిర్ణయానికి వచ్చి, ఏదో పుస్తకం తీసి తిరగేస్తూ కూర్చున్నాడు శర్మ ఆ ప్రసక్తి వదిలిపెట్టి తన పన్లు చూసుకోసాగింది అరుణ

ఇంతటికీ కారణం – ఆ వూళ్ళోనే వున్న శర్మ ముఖ్య బంధువులింట్లో పెళ్ళి రాత్రి పదకొండు గంటలకు ముహూర్తం! పెళ్ళికి రెండు రోజుల ముందే రమ్మని చెప్పారు వాళ్ళు. ఏదో మాట వరసకన్నారనీ, పెళ్ళి రోజు వెళ్ళొచ్చునీ మాట్లాడక వూరుకున్నాడు శర్మ అయితే వాళ్ళు వూరుకోకుండా ఆ రోజు ఉదయం మళ్ళీ మనిషిని పంపించారు ఆఫీసుకు సెలవు పెట్టేందుకు వీలుగాక పోవడంతో సాయంత్రం అరుణా, తనూ వస్తామని కబురు తెచ్చిన మనిషితో చెప్పాడు శర్మ అతను తప్పనిసరిగా రమ్మని మరోసారి చెప్పి – శర్మ పిల్లలిద్దర్నీ వెంటబెట్టుకొని వెళ్ళిపోయాడు – శర్మ ఆఫీసుకెళుతూ సాయంత్రం తనొచ్చేసరికి సిద్ధంగా వుండమని అరుణకు చెప్పాడు

తీరా సాయంత్రం శర్మ ఇంటికొచ్చేసరికి చాలా ముభావంగా వుంది అరుణ అడగ్గా, అడగ్గా అసలు కారణం బయటపెట్టింది కనీసం మెళ్ళోకి చిన్న గొలుసైనా లేకుండా వెళితే తననంతా చిన్న చూపు చూస్తారని అరుణ బాధ! ఆ మాట నిజమే అయినా ఆ లోటు పూడ్చగలిగేది కాదు ఏదో చిన్న ఉద్యోగంతో సంసారం నెట్టుకొస్తున్న శర్మ ఇకముందు కూడా ఆ లోటు పూడ్చగలడన్న నమ్మకమూ లేదు ఇంట్లో అప్పుడప్పుడ ఏర్పడ్డ ఇబ్బందులకు అరుణ ఒంటి మీదుండే కొద్దిపాటి బంగారం ఏనాడో హరించుకుపోయింది. ఆ విషయం జ్ఞాపకొచ్చినప్పుడల్లా శర్మకెంతో బాధ కలుగుతుంది ఇలాంటి శుభకార్యాలు వచ్చినప్పుడు ఆ బాధ రెట్టింపు అవుతుంది అయినా అతడు చెయ్యగలిగింది లేదు సామాన్యుడు 'బంగారం' అనేదొకటుందని మర్చిపోవాల్సిన రోజులివి

–పుస్తకం తిరగేస్తున్నాడే కాని శర్మ దృష్టి దాని మీద లేదు వస్తామని చెప్పి వెళ్ళకపోతే పెళ్ళి వారేమనుకుంటారో నన్న ఆలోచన అతడి మనస్సును తొలుస్తోంది

ఇంతలో పెళ్ళివారింటి దగ్గర్నుంచి ఉదయం వచ్చినతను మళ్ళీ వచ్చాడు.

'ఇదేమిటి మీరొస్తారని ఎదురు చూస్తుంటే ఇక్కడ స్థిమితంగా కూర్చున్నారు? అన్నాడతను లోపలికొస్తూనే

మళ్ళీ కబురు రావడంతో సిగ్గుపడ్డాడు శర్మ అతడికేం చెప్పాలో తోచలేదు

ఇంకా టైముంది కదా అప్పుడే తొందరెందుకని . ." అన్నాడు కొన్ని క్షణాల తర్వాత ఏదో కటనకపోతే బాగుండదని

'భలేవారే నలుగురూ ఉంటే అదో సందడి!

ఏమ్మా మీరింకా అలాగే వున్నారు? తొందరగా బయల్దేరండి' అన్నాడతను అరుణను చూస్తూ

"అలాగేనండీ అలాగే అంది ముభావంగా గుమ్మంలో నిలబడ్డ అరుణ

'వచ్చేస్తారు కదూ! నాకింకా బజార్లో పనుంది నేను మళ్ళీ రాకుండా రావాలి మీరు" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడతను

ఇక మనం వెళ్ళకపోతే సభ్యతగా వుండదు అరుణా! ఈసారికి నీ పట్టుదల సడలించుకొని నా మాట దక్కించు' అన్నాడు ప్రాధేయ పూర్వకంగా శర్మ

మీ మాటేగాని నా మాట వినిపించుకోరా మీరు? నలుగుర్లోనూ నన్ను చిన్నబుచ్చడం మీకు సరదాగా వుందా? మీరెన్ని చెప్పినా ఏదొక వస్తువు లేకుండా నేను రాలేనండీ!" అంది నిష్కర్షగా అరుణ

నీకిది న్యాయంకాదు అరుణా! మనకు లేనివి ఇప్పుడు కావాలంటే ఎలా వస్తాయి చెప్పు? అన్నాడు దీనంగా శర్మ

రావు గనకే గోపాల్‌గారింట్లో ఏదైనా అడిగి తీసుకురమ్మంటున్నాను

నేనేమంటూ వెళ్ళి అడగను? ఆవిడ నీకూ తెలుసు కదా నువ్వెళ్ళి అడిగి తెచ్చుకోకూడదూ! అన్నాడు రాజీకొస్తూ శర్మ

మీరు అడగలేరు కానీ నేను వెళ్ళి అడగాలా? ఈ గొడవంతా దేనికి మీరెళ్ళి వచ్చేయండి పెళ్ళికి!" అంది కుండబద్దలు కొట్టినట్టు అరుణ

'ఈ బోడి సలహా నువ్వు చెప్తావని కాదు అయిదు నిముషాల క్రితం కూడా వస్తామని వాగ్దానం చేసి ఇప్పుడు నేనొక్కణ్ణే వెళ్ళడం ఏమంత మర్యాద? సరే నువ్వు తయారవ్వు నేనే వెళ్ళి తెస్తాను' అని విస విస లాడుతూ బయటికొచ్చాడు శర్మ

వెళ్తున్న శర్మను చూస్తూ తన పట్టుదల నెరవేరినందుకు చిన్నగా నవ్వుకొని స్నానం చేసేందుకు పెరట్లోకి నడిచింది అరుణ

అరగంట తరువాత తిరిగి వచ్చిన శర్మ – ఇదిగో గొలుసు అప్పుడే ఏడైంది టైము తొందరగా కదులు' అన్నాడు కోపంగా

నాదేం ఆలస్యంలేదు పదండి!" అంది. శర్మ

# ఎరువు సొమ్ము

తెచ్చిన రెండు పేటల గొలుసు మెళ్ళో వేసుకొని, ఓసారి అద్దంలో చూసుకొచ్చి అరుణ

తలుపు తాళం వేసి, రోడ్డు మీదికొచ్చి రిక్షాలో పెళ్ళి వారింటికి బయల్దేరారు అరుణా, శర్మలు - వాళ్ళక్కడకు చేరుకునేసరికి పావు తక్కువ ఎనిమిదయింది

అప్పటికే భోజనాల కార్యక్రమం జోరుగా సాగుతోందక్కడ శర్మ బంధువులకు ఒకే ఒక ఆడపిల్ల అవడంచేత అన్ని ఏర్పాట్లూ బారీఎత్తున చేశారు వచ్చిన చుట్టాలతో, స్నేహితులతో చాలా సందడిగా వుంది పెళ్ళి వారిల్లు ఎంత హడావిడిగా వున్నా అరుణా, శర్మలను సాదరంగా ఆహ్వానించారు వారు ఆలశ్యంగా వచ్చినందుకు మెత్తగా చివాట్లు కూడా పెట్టారు

అరుణ వూహించినట్టుగానే చాలా మంది ఆడవారు విలువైన నగలతో, ఖరీదైన చీరలతో పెళ్ళికి హాజరయ్యారు తమ తమ ఆడంబరాల్ని, అతిశయాల్ని ప్రదర్శించుకోడానికి ఆడవారి కంతకన్నా మంచి సమయం వుండదేమో!?

ఎనిమిదిన్నరయేసరికి భోజనాలు పూర్తయి– పెళ్ళి తతంగం మొదలైంది అంతా కల్యాణ మండపం దగ్గర చేరారు పెళ్ళిళ్ళు చెయ్యడంలో అనుభవజ్ఞులైన పేరయ్య శాస్త్రిగారు తన గంభీర కంఠంతో మంత్రాలు చదువుతూ పెళ్ళి కార్యక్రమాన్ని చాలా నిష్ఠతో జరిపిస్తున్నారు మంగళ సూత్ర ధారణ పూర్తయ్యాక ఉత్సాహంతో ఉద్వేగంతో వధూవరులు పోటా పోటీలుగా తలంబ్రాలు పోసుకుంటున్నారు తమ పెళ్ళినాటి ఆ ముచ్చటను తల్చుకుంటూ అక్కడున్న ఆడా, మగా ఆ దృశ్యాన్ని ఆసక్తిగా చూస్తున్నారు

చటుక్కున అప్పుడే కరెంటు పోయింది అంతా చీకటిమయం పెట్రొ మాక్సు లైటు వెలిగించండి' అన్నా రెవరో కంగారుగా ఈ కరెంట్ ఎప్పుడూ ఇంతే ముందు లైటు వెలిగించి వుంచుకోవడం తెలియదూ? అన్నారు మందలిస్తున్న దోరణిలో మరెవరో మొత్తాని కైదు నిమిషాల్లో పెట్రొ మాక్సు లైటు వెలిగించారు– ఆ వెంటనే కరెంటూ వచ్చింది

మరి కాస్సేపట్లో వివాహ కార్యక్రమం పూర్తయింది వూళ్ళో వాళ్ళంతా ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోసాగారు అరుణా శర్మలు కూడా పెళ్ళివారితో చెప్పి, పిల్లల్ని తీసుకొని బయల్దేరారు

సగం దూరం వచ్చాక ఎందుకో మెడ చూసుకున్న అరుణ, అయ్యో నా మెడలో గొలుసేదండీ? అంది హడిలిపోతూ

ఉలిక్కిపడి శర్మ ఏమైంది గొలుసు? ఇంతవరకూ నిద్రపోతున్నావా? అన్నాడు కోపోద్రేకాలతో

లేదండీ, పెళ్ళి పందిట్లో నాలుగు సార్లు చూసుకున్నప్పుడు కూడా గొలుసు మెళ్ళోనే వుంది ఇంతలోనే ఏమైంది? ఇప్పుడెలాగండి బాబూ!" అంది ఏడుపు గొంతుతో అరుణ

ఎలా అనే నిన్నడుగుతున్నాను? నువ్వంత జాగ్రత్తగా వుంటే గొలుసెలా పోతుంది? తీవ్ర స్వరంతో అడిగాడు శర్మ

అంటే నేను అజాగ్రత్తగా వున్నానని మీ ఉద్దేశ్యమా నా మాట నమ్మండి! నేను చూసుకున్న నాలుగు సార్లూ గొలుసు మెళ్ళోనే వుంది ఇంత చిత్రంగా ఎలా మాయమైందో అంటూ కొన్ని క్షణాలపాటు ఆలోచించి, బహుశా కరెంటు పోయినప్పుడే నా మెడలో గొలుసు పోయి వుండాలి కరెంటు వచ్చాక నేను చూసుకో లేదు ఒక్కసారి రిక్షా వెనక్కి తిప్పించండి అక్కడి కెళ్ళి అడుగుదాం' అంది కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతూండగా అరుణ

పెళ్ళికొచ్చిన సగం మంది పైగా వెళ్ళిపోంచా ఇప్పు డెవర్నడుగుతాం? కావాలని గొలుసు దొంగిలించిన వాళ్ళు తిరిగి ఇస్తారా? వద్దు వద్దు అంటున్నా నాచేత బలవంతంగా గొలుసు తెప్పించి– ఎంతపని చేశావ్ అరుణా! అన్నాడు శర్మ

ఎందుకైనా మంచిది ఒక్కసారి పెళ్ళివారింటి కెళ్ళి చూద్దామండీ' అంది ఏదో ఆశతో అరుణ

ఏమిటి చూసేది నీ మొహం నా మొహం!

అదేమిటండీ అలా అంటారు! గొలుసు మన స్వంతమా పోతే పోయిందని వూరుకోడానికి పోనీ మనకు కొనిచ్చే స్తోమతైనా వుందా? వెళ్ళి చూడకపోతే ఎలాగండీ?

నీకన్నీ తెలుసు అరుణా! మనకు లేనిది

## గమనిక

వ్యక్తులపేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520 003 అన్న చిరునామాకి పంపండి.

—సం.


BA/B.COM, ఎంట్రెన్స్ (ఆంధ్రా–ఓపెన్ యూనివర్సిటీ)

ఏ విద్యార్హత లేకుండా 20 సం॥లు నిండినవారు ఒక్క సంవత్సరములో 'ఎంట్రన్స్' వ్రాసి B.A., B.Com ఇంగ్లీషు, తెలుగు మీడియంలో చదువవచ్చును అత్యున్నత పోస్టల్/ఓరల్ శిక్షణ తేలిక పద్ధతిలో వ్రాయబడిన నోట్సు ఉత్కృష్ట ఫీజు వివరములకు ప్రాస్పెక్టస్ రూ 5/- M.O

DIRECTOR Ph: 3803
SRI LAXMI TUTORIALS
NEAR NEW BRIDGE, TENALI

Pin: 522201 (A.P.)



మోడర్న్ ఆర్ట్స్

ఫొటోగ్రఫీ, కలర్ ఫొటోగ్రఫీ, స్క్రీన్ ప్రింటింగ్‌లను ఆధునిక కళలుగా పరిగణించవచ్చును. మా సంస్థ నిపుణుల ద్వారా ఈ అన్ని కళల రహస్యాలు తెలుసుకోండి. ఇవన్నీ కూడా మంచి ఆదాయమును చేకూర్చేవే కాకుండా ఉత్సాహాన్నిచ్చే హాబీలు కూడా.

ప్రాస్పెక్టస్‌కోసం వ్రాయండి :

Kalaimathi Nilayam (P)
Nanjai Thalaiyur, 639204,
Perigar Dist., Tamilnadu.

కావాలనడం తెలుసు పోతే కొనిచ్చే స్తోమత లేదనీ తెలుసు అన్నీ తెలిసే గొలుసు పోగొట్టావ్! నీ పిచ్చిగాని ఆ గొలుసు దొరుకుతుందన్న నమ్మకం లేదు సరే, అదీ చూద్దాం! అంటూ రిక్షా వెనక్కి తిప్పించాడు శర్మ

అక్కడికి వెళ్ళి బంధువులతో విషయం చెప్పాక శర్మ అనుకున్నట్టుగానే అన్నారు వాళ్ళు తమ ఇంట్లో అలా జరిగినందు కెంతగానో నొచ్చుకొని, కొంత సేపు పెళ్ళి పందిట్లో వెదికారు గొలుసు కనిపించలేదు చేసేది లేక బరువెక్కిన హృదయాలతో బాధతో అరుణా, శర్మలు ఇంటి కొచ్చారు

ఇంటి కొచ్చే రావడంతోనే విపరీతమైన తలపోటు ప్రారంభ మైంది శర్మకు ఆ బాధ భరించలేక తలకు అమృతాంజనం పట్టించి కళ్ళు మూసుకు పడుకున్నాడు పిల్లలు కూడా వెంటనే నిద్రలో పడ్డారు

అరుణ మాత్రం నిద్ర సంగతి మర్చిపోయింది ఆమె మనసు మనసులో లేదు భర్తకంత తలనొప్పి ముంచుకు రావడానికి కారణం తనే కాస్సేపటి భాగ్యం కోసం బలవంతంగా వస్తువు తెప్పించి భర్తనెంత ఇరుకున పడేసింది తను తెల్లవారితో గోపాల్ వాళ్ళకేం సమాధానం చెబుతాడు శర్మ! గొలుసు పోవడం నిజమైనా ఆ విషయం వాళ్ళు నమ్ముతారా? నమ్మినా తమ వస్తువు ఖరీదు ఇవ్వమని పట్టుబడితే తన భర్త ఏం చెయ్యగలడు? ఏ నెలకా నెల సంసారం గడపటానికే కష్టపడుతున్న శర్మ ఇంచు మించు మూడు వేలు ఎక్కడ నుంచి తెస్తాడు?? ఇలాంటి ఆలోచనలతో ఆమెకు మతి పోతోంది పొంగుకొస్తున్న దుఃఖాన్ని బలవంతాన నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తోంది

* * * * *

తెల్లవారి శర్మ కళ్ళు తెరిచే సరికి, సర్వమూ పోగొట్టుకున్న దానిలా ఎదురుగా కూర్చొని వుంది అరుణ

'నువ్వసలు నిద్రపోలేదా?' అన్నాడు లేచి కూర్చొని శర్మ

సమాధానంగా పెదవి విరిచి; ఇప్పుడేం చేద్దామండీ? అంది హీన స్వరంతో అరుణ

ఏం చెయ్యాలో నువ్వే చెప్పు? అన్న మాట ప్రకారం ఇప్పుడు గొలుసు పట్టుకెళ్ళి ఇవ్వకపోతే ఇంకాస్సేపట్లో గోపాల్ ఇక్కడి కొస్తాడు ఉద్యోగం రిజైన్ చేసి ఆ వచ్చిన డబ్బుతో వాళ్ల వస్తువు ఖరీదు ఇచ్చివేయడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు అన్నాడు ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలా శర్మ

అతడికా ఉద్యోగం కూడా లేక పోతే తామెన్ని బాధలు పడాలో తెలిసిన అరుణ భయంతో కంపించి పోయింది చేతులారా చేసిన పొరపాటు కామె తల్లడిల్లి పోసాగింది అంతవరకూ దిగ మ్రింగుతున్న దుఃఖం ఆనకట్ట తెగిన నదిలా పొంగి పొర్లింది




ఆమె అవస్థ గ్రహించిన శర్మ, బాధపడకు అరుణా! ఒక విధంగా చెప్పాలంటే మనం చాలా అదృష్ట వంతులం! గోపాల్ వాళ్ళని వస్తువు అడగ లేక— అతని దగ్గరే అరవై రూపాయలు బదులు తీసుకొని, నిన్నిలా అయినా పెళ్ళికి తీసుకెళ్ళాలన్న ఉద్దేశ్యంతో రోల్డ్ గోల్డ్ గొలుసు కొని తెచ్చాను నువ్వు పారపడినట్లే అది బంగారపు గొలుసని పొరపడి ఎవరో నీ మెడలోది దొంగిలించారు అదే గోపాల్ వాళ్ళ దగ్గర వస్తువు ఎరవు తీసుకునుంటే ఇప్పుడు నేను చెప్పినట్టు ఉద్యోగం రిజైన్ చెయ్యడం తప్ప మరో మార్గంలేదు మనకు ఇదీ ఒకందుకు మంచిదే అయింది ఇక వూరుకో!" అన్నాడు చిన్నగా నవ్వుతూ

ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరైన అరుణ, "ఎంత చల్లని మాట చెప్పారు ఇంకెప్పుడు ఎరవు సొమ్ముకోసం ఆశించనండీ! నాకు బుద్ధొచ్చింది వున్నదానితో తృప్తి పడ్డం కన్నా మించిన ఆనందం మరొకటి లేదని తెలిసొచ్చింది!! అంది తేలికపడ్డ హృదయంతో ★ □